క్లుప్తంగా

15న ఉపాధి పనుల ప్రజావేదిక

మద్దూరు: మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో ఈ నెల 15న ఉపాధి హామీ పనులపై 13 వ విడత ప్రజావేదిక నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ సుధాకర్‌రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉపాధి హామీ పథకంలో గతేడాది ఏప్రిల్ 1నుంచి ఈ ఏడాది మార్చి 31 వరకు 6 కోట్ల 91 ఉపాధి కూలీలకు,. 74లక్షల 82వేలు సామగ్రికి ఖర్చు అయినట్లు తెలిపారు. వీటిని గతవారం రోజులుగా సామాజిక తనిఖీ సిబ్బంది పరిశీలించి నివేదికను ప్రజావేదికలో సమర్పించనున్నట్లు ఆయన పేర్కొన్నారు.

ఘనంగా అయ్యప్ప పడిపూజ



మద్దూరు: మండలంలోని పెదిరిపాడ్‌లోని రాములు మాలధారుడి ఇంట్లో బుధవారం అయ్యప్ప పడిపూజను గురుస్వాములు మహేష్, శ్రీనివాస్‌రెడ్డి, విష్ణు, మహేందర్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. అయ్యప్పకు అంగపూజ, అష్టోత్తరాల పూజలు చేశారు. అనంతరం అయ్యప్పస్వామి విగ్రహానికి ప్రత్యేకాభిషేకాలు పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అయ్యప్ప మాలధారులు భజనలతో ఆడిపాడారు. పడిపూజకు మద్దూరు, గొకుల్‌నగర్, దామరగిద్ద, ఒత్తుగుండ్ల తదితర గ్రామాలకు చెందిన మాలధారులు హాజరైయ్యారు.

అలరించిన సెమీ క్రిస్మస్ వేడుకలు



స్టేషన్ మహబూబ్‌నగర్: జిల్లా కేంద్రంలోని కల్వరి ఎంబీ చర్చి ఆవరణలో బుధవారం రాత్రి సెమీ క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. గాయక బృందం ఆధ్వర్యంలో భక్తి గీతాలు ఆలపించారు. ఎంబీసీ చైర్మన్ రెవరెండ్ ఎస్.వరప్రసాద్ ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం క్రైస్తవులు కొవ్వొత్తులను వెలిగించి ప్రదర్శించారు. కేక్‌కట్ చేశారు. హైదరాబాద్‌లోని డెస్టినేషన్ చర్చి పాస్టర్ రెవరెండ్ సైలస్ రెజినాల్డ్ ముఖ్య సందేశం ఇచ్చారు. బైబిల్‌లోని పలు ఘట్టాలను చదివి వినిపించారు. ఏసుక్రీస్తు మార్గంలో నడవాలని పిలుపునిచ్చారు. వేడుకల్లో చిన్నారులు, యువత చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు, నాటక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఎంబీసీ చర్చి వైస్ చైర్మన్ బీఐ.జేకబ్, కార్యదర్శి జేఐ.డేవిడ్, కోశాధికారి టీఏ.స్టిఫెన్, సంయుక్త కార్యదర్శి ఇమ్మాన్యుయేల్ రాజు, దాసరి సుందర్, పాస్టర్లు డానియల్ సుధీర్, మరియన్, సుందర్ పాల్, డాక్టర్ శామ్యుల్, ఏసుపాదం, డాక్టర్ విజయ్‌కాంత్, డాక్టర్ ప్రణయ్ పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణ బిల్లుకు చట్టబద్ధత కల్పించాలి



మహబూబ్‌నగర్ రూరల్: ఎస్సీ వర్గీకరణ బిల్లును పార్లమెంట్ సమావేశాల్లో ప్రవేశపెట్టాలని డిమాండ్ చేస్తూ ఈనెల 20న ఢిల్లీలో నిర్వహించ తలపెట్టిన ధర్నా కరపత్రాలను నాయకులు విడుదల చేశారు. టీఎమ్మార్పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బాలరాజు, నాయకులు రాములు, మహేశ్వర్, శ్యామ్, రాజు, చంటి, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు. శీతాకాల పార్లమెంట్ సమావేశాల్లోనే ఎస్సీ వర్గీకరణ బిల్లును ప్రవేశపెట్టి చట్టబద్ధత కల్పించాలని దక్షిణ తెలంగాణ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు మల్లెపోగు శ్రీనివాస్ డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక ఎస్సీ కమ్యూనిటీహాల్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. వర్గీకరణ చేయకపోతే వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో మాదిగ, మాదిగ ఉప కులాల ప్రజలు బీజేపీకి ఓటుతో బుద్ధి చెబుతారని హెచ్చరించారు. రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ జంబులయ్య, ప్రధాన కార్యదర్శి అంజన్న పాల్గొన్నారు.

విద్యుత్ తీగలు తెగిపడి ఎద్దుమృతి

మరికల్: ప్రమాదావశాత్తు విద్యుత్ తీగలు తెగిపడి ఎద్దు మృతిచెందింది. మరికల్ గ్రామానికి చెందిన బోయ అనంతమ్మకు చెందిన ఎద్దులు బుధవారం పత్తి పంటల్లో మేత మేస్తుండగా కిందకు వేలాడుతున్న విద్యుత్ తీగలు ఓ ఎద్దు కొమ్ములకు తగిలిన వెంటనే తెగి దానిపై పడటంతో అక్కడిక్కడే మృతి చెందింది. కిందకు వేలాడుతున్న విద్యుత్ తీగలు స్తంభం వద్ద తరచుగా మంటలు వస్తున్నట్లు బాధిత రైతు తెలిపారు. దాదాపు రూ. 80 వేల విలువ చేసే ఎద్దు మృతి చెందడంతో మహిళ రైతు కన్నీరు మున్నీరయింది. విద్యుత్‌శాఖ తరఫున బాధిత మహిళ రైతును ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు. ఈ ఘటనపై పశువైద్యా సిబ్బంది పంచనామా నిర్వహించారు.

వంతెనలకు మోక్షమెప్పుడో

- బ్రిడ్జి లేక చుట్టూతిరిగి వెళ్తున్న ప్రజలు
- వానాకాలంలో రాకపోకలు బంద్
- చొరవ చూపాలంటున్న గ్రామస్తులు



గజ్జరం దొడ్డివాగుపై వంతెన నిర్మించాల్సిన చోటు

మాగనూర్: మండల కేంద్రం నుంచి అడవిసత్యరం గ్రామానికి వెళ్లేదారిలో వంతెన శిథిలావస్థకు చేరుకుంది. ఈ మార్గంలోని గజ్జరందొడ్డి – చిట్యాల గ్రామాలకు వెళ్లేదారిలో గజ్జరందొడ్డి గ్రామం సమీపంలోని పెద్దవాగుపై వంతెన నిర్మాణం కోసం ప్రజలు ఏళ్లతరబడి ఎదురు చూస్తున్నారు. గ్రామాల మధ్య దూరాన్ని తగ్గించాలని, అధికారులకు కలిసి వినతిపత్రాలు ఇస్తున్నా సమస్యకు పరిష్కారం దొరకడం లేదు. వాగుపై వంతెన నిర్మిస్తే రవాణా సౌకర్యం మెరుగుబడి, దురాభారం తగ్గుతుందని గ్రామస్తులు చెబుతున్నారు.

గజ్జరందొడ్డి – చిట్యాల గ్రామాల మధ్య

మాగనూర్ మండలంగా ఉన్న గజ్జరందొడ్డి, మందిపల్లి, కోల్పూర్, అడవిసత్యరం, వాడ్వట్, పుంజనూర్ గ్రామాల ప్రజలు కేవలం రెవెన్యూ సంబంధించిన విషయాలపై మాత్రమే మండల కేంద్రానికి వస్తుంటారు. మిగితా ఎటువంటి వ్యాపార అవసరాలకోసం మక్తల్‌కు 90శాతం మంది ప్రజలు వెళ్తుంటారు. అయితే గజ్జరందొడ్డి – చిట్యాల గ్రామాల మధ్య వంతెన నిర్మాణం లేక చుట్టు తిరిగి అదనంగా 15నుంచి 20కిలో మీటర్ల ప్రయాణం కొనసాగిస్తున్నామని వాపోతున్నారు. బ్రిడ్జి నిర్మిస్తే 12కిలో మీటర్ల దూరం తగ్గే అవకాశం ఉంది.

తప్పని ప్రయాణ కష్టాలు..

మందిపల్లి, కోల్పూర్, అడవిసత్యరం గ్రామాల ప్రజలు మండల కేంద్రానికి రావాలంటే కిలోమీటర్ల కొద్ది ప్రయాణం చేయాల్సిందే. ఆయా గ్రామాల ప్రజలు ప్రభుత్వ కార్యాలయాలకు, ఇతర పనుల నిమిత్తం మండల కేంద్రానికి వెళ్లాలంటే చిన్నపాటి వర్షాలకు దాదాపుగా పదికిలో మీటర్ల మేర చుట్టు పెగడబండ, అచ్చంపేట గ్రామాల మీదుగా తిరిగి ప్రయాణం చేయాల్సిందే. ఈ ప్రాంతంలోని హైలెవల్ బ్రిడ్జి నిర్మాణం చేపడితే దాదాపుగా 5కిలో మీటర్ల మేర దూరం తగ్గనుంది. కోట్లాది రూపాయలు వేచ్చించి బీటీరోడ్డు నిర్మాణం చేసిన లోలెవల్ బ్రిడ్జితో వర్షకాలం వస్తే చాలు వాగుపై రాకపోకలకు అవకాశం ఉండదు. వాహనాదారులు అష్టకష్టాలు పడుతూ వాగుదాటుతూ ప్రయాణం చేస్తున్నారు. వాగులో నీటి ప్రవాహం ఉన్నప్పుడు రాకపోకలు నిలిచిపోతున్నాయి.



శిథిలావస్థకు చేరుకున్న అడవిసత్యరంలో లెవల్ వంతెన

గతంలో ఎమ్మెల్యే హామీ

గజ్జరందొడ్డి – చిట్యాల గ్రామాల మధ్య పెద్ద వాగుపై వంతెన నిర్మాణంకోసం గతంలో ప్రస్తుత ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి వంతెన నిర్మాణానికి మూడు సంవత్సరాల క్రితం హామీ ఇచ్చారని ఆయా గ్రామాల ప్రజలు చెబుతున్నారు. మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి ఈ గ్రామాల ప్రయాణ కష్టాలు చూసి త్వరగా ఈ మార్గంలో బ్రిడ్జి నిర్మాణం ప్రారంభించాలని ప్రజలు, ప్రయాణికులు కోరుతున్నారు.

బ్రిడ్జి నిర్మిస్తే బాగుంటుంది..



మా ఊరు నుంచి చిట్యాల గ్రామం గుండా మక్తల్ పట్టణ కేంద్రానికి చేరుకోవాలంటే ఇబ్బందిగా ఉంది. బ్రిడ్జి లేక పోవడంతో వాగు దాటలేక ఇబ్బందికరంగా మారింది. వానాకాలమైతే రాకపోకలు బంద్ అవుతాయి. బ్రిడ్జి నిర్మిస్తే మాకు సౌకర్యంగా ఉంటుంది. దూరం, సమయం ఆదా అవుతుంది.

– గోవింద్‌రెడ్డి, గజ్జరందొడ్డి

వర్షాకాలం ఇబ్బంది..



మాది మందిపల్లిలో గజ్జరందొడ్డి – చిట్యాల గ్రామాల మధ్య బ్రిడ్జి నిర్మాణం తోపాటుగా పస్పుల – మందిపల్లి వాగుపై కూడా బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలని గతంలో అధికారులకు చాలాసార్లు విన్నవించాం. ఈ వంతెన నిర్మాణంతో రైతులకు ఎక్కువగా ఉపయోగం ఉంది. అధికారులు ఇటుగా ఆలోచించి వంతెన నిర్మాణం చేపట్టే విధంగా చర్యలు ప్రారంభించాలి.

– ఖయ్యుం పాషా, మందిపల్లి ఉపసర్పంచ్

ప్రపోజల్ పంపించాం..

ముఖ్యంగా గజ్జరందొడ్డి – చిట్యాల గ్రామాల మధ్య వాగుపై వంతెన నిర్మాణం కోసం గతంలోనే ప్రపోజల్ పంపించాం. ఈ సంవత్సరం ప్రధాన మంత్రి సడక్ యోజన్ కింద మంజూరైయ్యేటట్లు ప్రయత్నం చేస్తాం.

– విలోక్, పీఆర్ ఏఈ

చిన్నారులకు వసతులు కల్పించాలి



అవగాహన కల్పిస్తున్న కో ఆర్డినేటర్ నర్సింహులు

మక్తల్: వలస కూలీల పిల్లలకు పని ప్రదేశంలో చదువుకునేందుకు వసతి కల్పించాలని చైల్డ్‌హెల్ప్ లైన్ జిల్లా కోఆర్డినేటర్ నర్సింహులు అన్నారు. బుధవారం మక్తల్‌లో ఇటుక బట్టీల వద్ద పనిచేసేందుకు వివిధ రాష్ట్రాల నుంచి కూలీలు వలస వచ్చి తమ ప్లిలలతో అక్కడికి చేరుకొని పనులు చేసుకుంటున్నారు. ఇటుక బట్టీల యజమానులకు అవగాహన కల్పించారు. బడిబయట ఉన్న పిల్లలను బడిలో చేర్పించాలన్నారు. ఐసీడీఎస్ వారు కల్పించే సదుపాయాలను వివరించారు. పిల్లలకు చదువు వసతి లేకుంటే శాఖ పరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

ఆడపిల్లలను చదివించాలి



మక్తల్: పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో బుధవారం జిల్లా డీహెచ్‌ఈడబ్ల్యూ ఆధ్వర్యంలో బేటీ పడావో.. బేటీ బచావో కార్యక్రమం నిర్వహించారు. ప్రభుత్వ ఆస్పత్రిలో కాన్పులు చేయించుకున్న వారికి పండ్లు, స్వీట్లు డాక్టర్ పార్వతి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆడపిల్లను చక్కగా చదివించాలని సుకన్య సమృద్ధి యోజన పథకం కింద అకౌంట్ తీయాలని సూచించారు. కేంద్ర ప్రభుత్వం నుంచి అకౌంట్లో డబ్బులు పడతాయన్నారు. కార్యక్రమంలో అధికారులు రేణుక, అనిత తదితరులు పాల్గొన్నారు.

రిటైర్డ్ ఉద్యోగులకు జీతాలు చెల్లించాలి

మక్తల్: విశ్రాంతి ఉద్యోగులకు జీతాలను వెంటనే చెల్లించాలని నూతన ప్రభుత్వానికి విశ్రాంతి ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు గోపాలం, ప్రధాన కార్యదర్శులు భాస్కర్, సిద్ధరామయ్య విజ్ఞప్తి చేశారు. బుధవారం వారు స్థానిక విలేకరులతో మాట్లాడుతూ ఇప్పటికీ తమ జీతాలు రాక ఇబ్బందులు పడుతున్నామన్నారు. మక్తల్‌లో ఎస్‌టీఓ పరిధిలో దాదాపు 500 మంది ఉన్నామని, ప్రతి నెలలో ఒకటో తేదీన జీతాలు వేయాలని కోరారు. అనంతరం 17న విశ్రాంతి ఉద్యోగుల దినోత్సవం ఉంటుందని అదేరోజు సన్మానం శ్రీ సత్యసాయి మందిరంలో ఉంటుందన్నారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి హాజరవుతారన్నారు. సమావేశంలో విశ్రాంతి ఉద్యోగులు సూర్యప్రకాష్, కృష్ణయ్యగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన పెంపొందించుకోవాలి



సదస్సులో మాట్లాడుతున్న అడ్వయిజర్లు

ఊట్కూరు: మండలంలోని బండమీది గేరిలో బుధవారం జిల్లా న్యాయసేవా అధికార సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన న్యాయవిజ్ఞాన సదస్సు విజయవంతమైంది. ఈ సందర్భంగా జిల్లా చీఫ్ లీగల్ ఏడ్ డిఫెన్స్ కౌన్సిల్ న్యాయవాది లక్ష్మీపతి గౌడ్ మాట్లాడారు. భారత న్యాయ వ్యవస్థ మరియు రాజ్యాంగం అందరికి అందాలనే ఉద్దేశంతో డిఫెన్స్ కౌన్సిల్ వ్యవస్థ వచ్చిందని, ఈ వ్యవస్థ ద్వారా ప్రతిపేదలు న్యాయం పొందొచ్చునని తెలిపారు. చట్టం దృష్టిలో అందరూ సమానమని, మనం చట్టాన్ని గౌరవించినప్పుడే చట్టం మనకు మేలు చేస్తుందని తెలిపారు. బాలకార్మిక వ్యవస్థ, బాల్యవివాహాలు, ఆన్‌లైన్‌మోసాలు తదితర అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ సురేష్, అడ్వకేట్ దత్తాత్రేయ, మహిళా గ్రూప్ సీఈఓ ఆశప్ప, నారాయణ, సుకన్య, రజని, నర్మద, మహెబూబ్, బసిరెడ్డి పాల్గొన్నారు.

పాఠశాలకు ప్రహరీ నిర్మించాలి



ప్రహరీ లేని వర్కూర్ ప్రాథమిక పాఠశాల

మాగనూర్: మండల పరిధిలోని వర్కూర్ ప్రాథమిక పాఠశాలలో ఒకటి నుంచి ఏడో తరగతి వరకు ఉండగా పాఠశాలలో అధిక సంఖ్యలో విద్యార్థులు ఉన్నారు. అయితే ప్రస్తుతం గ్రామం చివరిలో పాఠశాల ఉండటం కనీసం ప్రహరీ లేక నిత్యం విద్యార్థులు చాలా ఇబ్బందులకు గురవుతున్నారు. మధ్యాహ్న సమయంలో విద్యార్థులు భోజనం చే స్తుండగా పందులు రావడం, రాత్రి వేళ్లలో కొందరు వ్యక్తులు పాఠశాల ఆవరణలో మద్యం సేవిస్తున్నారని గ్రామస్తులు వాపోతున్నారు. అధికారులు స్పందించి పాఠశాలకు ప్రహరీ నిర్మించాలని విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు కోరుతున్నారు.

ప్రమాదకరంగా మలుపులు



మూలమలుపులో ప్రమాదకరంగా మారిన రోడ్డు

మాగనూర్: మండల పరిధిలోని వాడ్వట్ గ్రామానికి వెళ్లే రహదారిలో మలుపుతో వాహనదారులు నిత్యం ప్రమాదాల బారిన పడుతున్న అధికారులలో మాత్రం చలనం లేకుండా పోయింది. చాలా సార్లు అధికారులకు విన్నవించినా, సూచిక బోర్డులు కూడా ఏర్పాటు చేయకపోవడంతో నిత్యం ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. అందులో భాగంగా సోమవారం జరిగిన మలుపు ప్రమాదంలో ఒక యువకుడు అక్కడిక్కకడే దుర్మరణం పాలుకావడం జరిగింది. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతంలో రైతులకు అధికారులు సరైన అవగాహన కల్పించకపోవడంతో ఎక్కడబడితే అక్కడ రోడ్డును రైతులు తవ్వేస్తున్నారు. వీటితో కూడా ప్రమాదాలు సంబవిస్తున్నాయని ఇప్పటికైనా అధికారులు స్పందించి మలుపుల వద్ద సూచిక ఏర్పాటుచేయాలని ప్రజలు, వాహన దారులు కోరుతున్నారు.

అధికారుల నిర్లక్ష్యం.. తాగునీటికి శాపం



తాగునీటి కోసం శ్రమిస్తున్న గ్రామస్తుడు

మాగనూర్: మండల పరిధిలోని మందిపల్లిలో అధికారుల నిర్లక్ష్యం.. గ్రామస్తుల తాగునీటికి శాపంగా మారిందని చేప్పవచ్చు. వివరాల్లోకి వెళ్తే.. గ్రామంలోని రైతువేదిక సమీపంలో నూతనంగా ఏర్పాటుచేసిన సీసీరోడ్డుతో గ్రామస్తులకు తీవ్రంగా ఇబ్బందులు ఎదురవుతున్నాయి. సీసీరోడ్డు వేసే ముందు అధికారులు ఇరువైపుల మురుగు కాల్వతోపాటుగా తాగునీటి పైపులైన్‌లు సరిచూసుకోవాల్సిన అవసరం ఉంది. కానీ అధికారుల తప్పిదంతో ప్రధానమైన తాగునీటి పైపులైన్ సీసీ రోడ్డు కింద ఉండిపోయింది. దీంతో ప్రతిరోజు కాలనీవాసులు తాగునీరు నింపుకునేందుకు తీవ్రంగా శ్రమించాల్సి వస్తుందని వాపోతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి సమస్య పరిష్కారానికి కృషిచేయాలని కోరుతున్నారు.

మండల సమస్యలపై అసెంబ్లీలో చర్చిస్తా

- ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి

నర్వ: మండల సమస్యలపై నేడు జరగబోయే అసెంబ్లీ రెండురోజుల సెషన్‌లో చర్చిస్తానని ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి అన్నారు. బుధవారం ఎంపీపీ జయరాములుశెట్టి అధ్యక్షతన నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు.. మండల సమావేశానికి కాస్త ఆలస్యంగా వచ్చానని సభ్యులు మన్నించాలన్నారు. త్వరలో మండల సమస్యలను చర్చించేందుకు ఒక్కరోజు రివ్యూవ్ సమావేశం ఏర్పాటుచేయాలని, అన్నిశాఖల ముఖ్య అధికారులు, మండల ప్రజాప్రతినిధులు హాజరై లోతుగా విశ్లేషణ చేసి పరిష్కారానికై చర్చిద్దామన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర వ్యాప్తంగా మహిళలకు మహాలక్ష్మీ పథకం ద్వారా ఉచితబస్సు ప్రయాణం కల్పించడంపై పెద్దకడ్మూర్ సర్పంచ్ శశిరేఖ ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలియజేశారు. అన్ని గ్రామాల్లో రోడ్లను మరమ్మతులు చేసి మరిన్ని బస్సులను ఏర్పాటు చేయాలని ఆమె కోరారు. కల్వాల్ ఎంపీటీసీ సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ.. రైతులకు 24గంటల విద్యుత్ కాంగ్రెస్ ప్రభుత్వం ఇస్తుందని అసెంబ్లీ సాక్షిగా చెప్పించాలని కోరారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రైతులకు గత ప్రభుత్వం కంటే నాణ్యమైన విద్యుత్ కాంగ్రెస్ ప్రభుత్వం అందిస్తుందని, రైతులు ఎలాంటి అపోహలు నమ్మొద్దన్నారు. కార్యక్రమంలో జెడ్పీ చైర్‌పర్సన్ వనజమ్మ, ఎంపీపీ జయరాములుశెట్టి, వైస్ ఎంపీపీ వీణావతి, ఎంపీడీఓ సుదర్శన్, పీఏసీఎస్ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, తహసీల్దార్ మల్లారెడ్డి, బండ్ల లక్ష్మీకాంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అపూర్వ స్వాగతం..

ఎమ్మెల్యేగా మొదటిసారి నర్వకు రావడంతో మండల పరిషత్ కార్యాలయాన్ని మామిడి తోరణాలతో అలంకరించి అపూర్వ స్వాగతం పలికారు. అనంతరం ఏర్పాటుచేసిన కార్యక్రమంలో అధికారులు, మండల ప్రజాప్రతినిధులు, ఆయా గ్రామాల కాంగ్రెస్ పార్టీ నాయకులు ఎమ్మెల్యేను శాలువాతో సన్మానించారు. మండల కాంగ్రెస్ అధ్యక్షుడు చెన్నయ్యసాగర్, నాయకులు కృష్ణారెడ్డి, నీరజ్, శ్రీనివాస్‌రెడ్డి, శరణప్ప, వివేక్, పోలీస్ జగన్‌మోహన్‌రెడ్డి, లక్ష్మణ్‌గౌడ్, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

మహిళల రక్షణకు ప్రత్యేక చట్టాలు



అవగాహన కల్పిస్తున్న శ్రీదేవి

నారాయణపేట రూరల్: మహిళలు, బాలికల రక్షణకు ప్రత్యేక చట్టాలు ఉన్నాయని ఏఎస్ఐ శ్రీదేవి అన్నారు. బుధవారం పట్టణంలోని ప్రభుత్వ పాఠశాలలో ఉమెన్ సేఫ్టీ అనే అంశంపై అవగాహన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మహిళలు, బాలికలతో ఎవరైన ఈవ్‌టీజింగ్, ర్యాగింగ్, ప్రేమ పేరుతో వేధింపులకు పాల్పడితే వెంటనే డయల్ 100, మహిళా హెల్ప్‌లైన్ నంబర్ 8712670398కు కాల్‌చేసి ఫిర్యాదు చేయాలన్నారు. సైబర్ నేరాలను అరికట్టడానికి సెల్‌ఫోన్ వినియోగం తగ్గించాలని, అమ్మాయిలకు గుడ్, బ్యాడ్ టచ్ గురించి తెలిసి ఉండాలన్నారు. అమ్మాయిలతో పాటు మగపిల్లల్లోను మార్పు రావాలన్నారు. కేసుల్లో ఇరుక్కుంటే భవిష్యత్‌లో ఉద్యోగ అవకాశాలు కోల్పోతారని హెచ్చరించారు. బాల్యవివాహాలు చేసే తల్లిదండ్రులు, హాజరైన వారిపై చట్ట ప్రకారం చర్యలు, కేసులునమోదు చేస్తామన్నారు. హెచ్‌ఎం గంగాధర్‌రెడ్డి, షీటీం సభ్యులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు సన్మానం



ఎమ్మెల్యేను సన్మానిస్తున్న ఇబ్రహీంపట్నం పార్టీ నాయకులు

నారాయణపేట: ఎమ్మెల్యే డాక్టర్ చిట్టెం పర్ణికారెడ్డిని బుధవారం విద్యుత్‌శాఖ ఎస్ఈ ప్రభాకర్, డీఈ సంజీవరెడ్డి, ఏడీఈ నందకిశోర్ మర్యాదాపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. నియోజకవర్గంలో విద్యుత్ సరఫరా తీరుపై ఎమ్మెల్యే అధికారులతో ఆరా తీస్తూ త్వరలోనే ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేయనున్నట్లు అధికారులకు సూచించారు.

ఎమ్మెల్యేకు సన్మానం

నారాయణపేట రూరల్: ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో విజయం సాధించిన పేట ఎమ్మెల్యే చిట్టెం పర్ణికారెడ్డిని బుధవారం యూటీఎఫ్ ఉపాధ్యాయ సంఘం సన్మానించింది. ఈ సందర్భంగా విద్యారంగ సమస్యలపై చర్చించారు. బాలాజీ, భీమయ్య, వెంకట్‌నాయక్ పాల్గొన్నారు. అదేవిధంగా లీగల్ అడ్వైజర్ రఘువీర్‌యాదవ్ సైతం శాలువాతో సన్మానించి అభినందించారు.

మరికల్: కొత్తగా ఎన్నికైనా ఎమ్మెల్యే పర్ణికారెడ్డిని బుధవారం ఇబ్రహీంపట్నం గ్రామ కాంగ్రెస్ నాయకులు కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా గత ప్రభుత్వం కారణంగా గ్రామంలో పెండింగ్‌లో ఉన్నా సమస్యలను ఎమ్మెల్యేకు వివరించారు. జనార్దన్, సత్యనారాయణ, శ్రీను, వెంకటయ్య, శేఖర్, రంగన్న, వెంకటేష్ పాల్గొన్నారు.

ఇళ్ల మధ్యలో నిలిచిన మురుగు



డ్రైయినేజీలు లేక ఇళ్లమధ్యలో పారుతున్న మురుగు

మాగనూర్: మండల పరిధిలోని అమ్మపల్లిలో మురుగు వచ్చి చేరుతుంది. గ్రామంలో ప్రధాన వీధులో డ్రైయినేజీల నిర్మాణం చేపట్టకపోవడంతో మురుగు మొత్తం ప్రవహించి కాలనీలోకి చేరుతుందని గ్రామస్తులు వాపోతున్నారు. దీంతో రోడ్లు పరిసరాలు అపరిశుభ్రంగా తయారయ్యాయని వీటికి తోడు పందులు ఇందులోకి దిగడంతో దుర్వాసన వేదజల్లుతుందని గ్రామస్తులు అన్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి గ్రామంలో డ్రైయినేజీ నిర్మాణం చేపట్టాలని కోరుతున్నారు.

పాతబావితో ప్రమాదం



మాగనూర్: మండల పరిధిలోని కోల్పూర్ గ్రామ పంచాయతీ పరిధిలో పురాతన బావి ప్రమాదకరంగా ఉందని గ్రామస్తులు, ప్రయాణికులు వాపోతున్నారు. గ్రామ సమీపంలో ఉండటంతోపాటు గ్రామ ప్రధాన రహదారి చెరువు కట్ట పక్కన ఉండటంతో వాహనాలు అదుపుతప్పి అందులో పడి ప్రమాదాలు సంబవించే అవకాశాలు ఉన్నాయంటున్నారు. గతంలో పల్లెప్రగతిలో భాగంగా ప్రమాదకర బావి మూసివేయాలని అధికారులు స్పష్టమైన ఆదేశాలు జారీచేసిన ఇప్పటివరకు బావిని మాత్రం పూడ్చకపోవడంపై అధికారుల తీరుపై గ్రామస్తులు, వాహన దారులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా పల్లెప్రగతిలో బావిని పూడ్చాలని కోరుతున్నారు.